# నవరసాలలో మొదటిది శృంగార రసం!

వేదాలు, చరిత్ర, సాహిత్య గ్రంథాలు, జానపద గీతాలలో శృంగార రసప్రస్తావన అనేకచోట్ల చేయబడింది. చివరకు మన దేవాలయాల గోడలమీద కూడా శృంగార రసానికెలాటి కొదువాలేదు!

అయినా... ఈనాటికి చాలామంది సెక్స్ అనే పదం వినగానే దాన్నొక బూతు పదంగా పరిగణించటం ఆశ్చర్యకరమైన విషయం.

నేటి సినిమాలలోనూ, రచనలలోనూ అశ్లీలమైన పదజాలాలతో సెక్స్‌ను వక్రీకరించటమే ఇందుకు కారణం కావచ్చు! సెక్స్ పట్ల ఏర్పడిన ఇలాంటి అపోహను తొలగించటానికి ఆంధ్రభూమి ప్రయత్నించబోతోంది! ఆంధ్రభూమి ఏం చేసినా ఓ ప్రత్యేకత ఉంటుంది! ఆ ప్రత్యేకత ఈ ప్రయత్నంలో కూడా పాఠకులకు కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది.

ఆయుర్వేద వైద్య విధానాన్ని సెక్సాలజీతో కలిపి పాఠకుల్ని సమ్మోహితుల్ని చేయబోయే ఈ సరికొత్త శీర్షిక నిర్వహించబోయే యువవైద్యుడు డాక్టర్ కంభంపాటి స్వయంప్రకాష్! డాక్టర్ ప్రకాష్ ఆయుర్వేద వైద్యంలో నాగార్జున విశ్వవిద్యాలయం నుండి బి.ఎ., ఎం.ఎస్, డిగ్రీని, గుజరాత్ ఆయుర్వేద విశ్వవిద్యాలయం, జామ్ నగర్ నుండి ఎం.డి. డిగ్రీలను సంపాదించుకున్న విజ్ఞాన నిధి! తర్వాత (జామ్‌నగర్) పాశర్లపూడి, విజయవాడలోని ఆయుర్వేద ఆసుపత్రులలో డాక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఈయన తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ కాలేజీలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

డాక్టర్ స్వయం ప్రకాష్ సెక్సాలజీలో దిట్ట. అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయంలో సెక్సాలజీ విభాగంలో ఉన్నత పరిశోధనలు కూడా జరిపి, మన ఆయుర్వేద వైద్య విధానాన్ని ఆ దేశంలో ప్రచారం చేయటానికి కృషి చేశారు.

ఆయుర్వేద డాక్టర్ అనగానే సనాతన భావాలతో, సంప్రదాయాలతో ఛాందసులుగా ఉంటారనే అందరి అభిప్రాయాల్ని మార్చివేసేట్లుగా ఎంతో మోడ్రన్‌గా కనిపిస్తారు డాక్టర్ ప్రకాష్! పూర్తిగా 32 సంవత్సరాలు వయసు కూడా నిండని ఈ యువకుడ్ని కదిలిస్తే చాలు... రన్నింగ్ ఎన్‌సైక్లోపీడియాలా ఎన్నెన్నో విషయాలు మనల్ని మంత్రముగ్ధుల్ని చేసేలా వెల్లువలా బయటకు వస్తాయి.

ఈ శీర్షిక చదువబోయే ముందు పాఠకులకు మీ గురించి, మీ ఫీచర్ గురించి చెప్తే బాగుంటుంది కదా! అని అడగ్గానే ఎంతో తెలివైన ఆంధ్రభూమి పాఠకులతో చాలా జాగ్రత్తగా ఉండాలన్నట్లుగా ముక్తసరిగా నవ్వుతూ అంతకన్నానా? అన్నారాయన.

మీరు ఆయుర్వేద వైద్యంలో స్పెషలిస్ట్ కదా! మరి సెక్సాలజీను ఆయుర్వేదాన్నీ దగ్గరకు ఎలా తీసుకొని వద్దామనుకుంటున్నారు? అన్న ప్రశ్నకు ఆయన జవాబు చెప్తూ

**ఆయుర్వేదంలో ఎనిమిది విభాగాలు ఉన్నాయి! అందులో ఒక విభాగం పేరు 'వాజీకరణ'. 'వాజి' అంటే గుర్రం. గుర్రానికి సంభోగశక్తి ఎక్కువ. సంభోగశక్తి తక్కువగా ఉన్నవాళ్ళకి దాన్ని పెంచే మార్గం గురించి చెప్పేదే వాజీకరణం! అంటే పురాతన కాలంలోనే సెక్స్‌కు తగిన ప్రాధాన్యతనిచ్చి ఆయుర్వేదంలో దీనికి సంబంధించిన ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించారు... మనవాళ్ళు!**

**అందువల్లనే మనదైన ఈ వైద్య విధానాన్ని సెక్సాలజీతో ముడివేసి ఆంధ్రభూమి పాఠకులకు అందిద్దామని నా కోరిక!**

భార్యాభర్తల్ని నిజంగా ఉల్లాసపర్చేది ఖచ్చితంగా శృంగార రసమే! మనలో చాలామంది అనుకుంటూ ఉంటారు - సెక్స్ గురించి మాట్లాడితే సభ్యతగా ఉండదని. అయినా మన జీవితంలో అతిముఖ్యమైన ఈ సందర్భం గురించి మాట్లాడినంత మాత్రాన పాడైపోయినట్లే అనుకోవటం ఓ భ్రమ మాత్రమే!

వీర్యనష్టం జరిగితే బలహీనమవుతారంటూ కొంతమంది అనుకుంటారు! నిజమే రతిక్రీడ జరిపిన తర్వాత ఎవరైనా అలసిపోతారు! కానీ మంచి ఆహారం తీసుకుంటే మళ్లీ కొద్దిగంటల్లోనే మామూలుగా అయిపోతారు! ఇలా భయపెట్టకపోతే చెడు తిరుగుళ్ళు తిరుగుతారనే ఉద్దేశంతో మన పెద్దలు పిల్లల్ని భయపెడ్తూ ఉండేవారని నా ఉద్దేశం అంటూ

మూఢనమ్మకాలకు సైంటిఫిక్ రీజనింగ్ ఇచ్చారు డాక్టర్ స్వయంప్రకాష్.

కామసూత్రాలకు, వాజీకరణానికి తేడా ఏమిటో వివరిస్తూ డా. స్వయంప్రకాష్ -

కామసూత్రాలు పూర్తిగా స్త్రీలకు ఎక్కువగా ప్రాముఖ్యతనిస్తూ వివరించబడ్డాయి. వాజీరణం అలా కాకుండా పూర్తిగా పురుషులకు సంబంధించిన విషయాలనే చెప్తుంది! అందువల్ల ఈ రెంటికీ ఎలాటి పోలికాలేదు!

అధర్వణ వేదం, ఛాందోగ్యోపనిషత్ వంటి గ్రంథాలలో కూడా కామశాస్త్రానికి సంబంధించి అనేక విషయాలు వివరించబడ్డాయి. అలా సాహిత్యం, చరిత్ర, వేదాలు, ఆయుర్వేదం, ఆధునిక విజ్ఞానాల్ని కలగలిపి వాటిలోని మంచి చెడ్డల్ని వివరించటమే ఈ శీర్షిక ముఖ్యోద్దేశం!

తర్వాత సెక్సాలజీ గురించి చెప్తూ డా. ప్రకాష్ తన అభిప్రాయాల్ని చాలా నిర్మొహమాటంగా వెల్లడించారు!

**నేనో విషయం స్పష్టంగా చెప్పదల్చుకున్నాను! చాలామంది సెక్సాలజీ అంటే శృంగార కథలో, లేదా బొమ్మలో ఉండే శాస్త్రమని అనుకుంటూ ఉంటారు! మరికొందరు దీన్ని కేవలం సుఖరోగాల చికిత్సకు సంబంధించిన శాస్త్రమని అనుకొంటారు - అసలు సెక్సాలజీ అంటే స్త్రీ పురుష ప్రవృత్తిలో భేదాలు, గర్భావస్థనుంచి శిశుజననం వరకూ - ఆ తర్వాత శరీరంలో కలిగే సహజమార్పుల గురించి వివరించే అద్భుత వైద్యవిజ్ఞానశాస్త్రం. ఇలాంటి ఎన్నో అపోహల్ని పాఠకులకు తొలగించాలనే అభిప్రాయంతోనే... ఈ శీర్షిక వ్రాద్దామని అనుకున్నాను.**

ఈ శీర్షికలో మీకెలాటి బూతు కనిపించదు! వైజ్ఞానికంగా ఆయుర్వేదాన్ని, సెక్సాలజీతో కలిపి, భార్యాభర్తలు ఆనందమైన వైవాహిక జీవితాన్ని ఎలా ఎంజాయ్ చేయాలో చెప్పటమే ఈ శీర్షిక ప్రధాన ఉద్దేశం.

నా అదృష్టం కొద్దీ నేను సెక్సాలజీలో ప్రపంచ ప్రసిద్ధి పొందిన అమెరికన్ డాక్టర్ ప్రొఫెసర్ జాన్‌మనీ దగ్గర ప్రత్యక్షంగా ఎన్నో విశేషాలు తెలుగుకోగల్గాను. ఆ అనుభవంతోనే ఆధునిక సెక్సాలజీని పురాతన ఆయుర్వేదంతో సంధానం చేసి వ్రాద్దామనే ఆలోచన నాకు కలిగింది!

మీరు అమెరికాలో కొంతకాలం ఉన్నారు కదా! ఆ దేశానికి మన దేశానికి సెక్స్ పట్ల అవగాహనలో ఎలాంటి తేడా ఉందో వివరించగలరా! అని అడిగినప్పుడు డాక్టర్ ప్రకాష్ సూటిగా బదులిచ్చారు.

"అమెరికా ఓపెన్ సొసైటీ" ఎవరికి ఎలాంటి ప్రొబ్లమ్ వచ్చినా వెంటనే సెక్సాలజీ, సైకాలజీ నిపుణులకు ఫోన్ చేసి సలహా పొందుతారు. ప్రొఫెసర్ మనీ దగ్గర ఉన్నప్పుడు నేను కూడా కొన్ని ఫోన్‌కాల్స్ రిసీవ్ చేసుకొని రోగులకు సలహాలిస్తుండేవాడ్ని! మనదేశంలో సెక్స్‌ను బూతు అనుకుంటూ నిజంగా సమస్యలు ఉన్నా బయటకు చెప్పుకోరు. అందువల్లనే మన దేశంలో నకిలీ సెక్స్‌డాక్టర్లు కూడా ఉన్నారు.

నేను ప్రొఫెసర్ మనీ దగ్గర ఉన్న సమయంలో మన ఆయుర్వేదాన్ని వారికి పరిచయం చేసి, దాన్ని సెక్సాలజీతో జోడించి కొన్ని పరిశోధన పత్రాల్ని కూడా ఆయనతో అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించాను! ఇంకా ప్రచురిస్తూనే ఉన్నాను!

చివరగా డాక్టర్ స్వయంప్రకాష్‌ను ఇబ్బంది పెడ్తూ ఆయుర్వేద వైద్యవిధానం అల్లోపతి కంటే మంచిదంటారా? అలాగే మత్తుమందులు, ఆల్కహాల్ కామశక్తిని పెంచుతాయా? అని అడిగినప్పుడు కూడా ఆయన తొణక్కుండా జవాబు చెప్పారు.

ఆయుర్వేద వైద్యంలో మేము ప్రధానంగా మూలికలకు సంబంధించిన మందుల్ని వాడ్తాము. అందువల్ల ఆయుర్వేద మందులు వాడటం వల్ల ఎలాటి చెడు ఫలితాలు ఉండవు.

ఆయుర్వేదంలోనైనా, మరో పద్ధతిలోనైనా మంచి పోషకాహారం తీసుకోవటం ముఖ్యం. మనకు ఉల్లాసం కలిగించే విషయాన్ని మాట్లాడుతూ, శరీరానికి తృప్తినిచ్చే ఆహారం తింటూ ఎలాటి భయం లేకుండా, పరిస్థితులు, పరిసరాలు అనువుగా ఉంటే... భార్యాభర్తలు సెక్స్‌ను నిజంగా ఎంజాయ్ చేయవచ్చు.

శుక్రాన్ని వృద్ధి పొందించటం ద్వారా కామశక్తిని వృద్ధి పొందించే మందులు చాలా ఆయుర్వేదంలో ఉన్నాయి. అలాటి మందుల్ని నిపుణులైన డాక్టర్లను సంప్రదించి వాడాలే తప్ప... స్వంత వైద్యం చేసుకోకూడదు! అలా తెలియకుండా మందుల్ని వాడితే కొన్ని సందర్భాలలో కామశక్తి తగ్గినా ఆశ్చర్యపోనవసరం లేదు!

ఇక నల్లమందు, గంజాయి, ఆల్కహాలు వంటివి తాత్కాలికంగా కామశక్తిని పెంచినా... మనిషి వాటికి బానిస అయి... చివరకు కామశక్తి తగ్గుతుందనటంలో ఎలాటి అనుమానం లేదు! అందువల్ల నిర్మలమైన మనస్సుతో రసికతను పెంచుకోవాలే తప్ప చెడు అలవాట్లతో కాదనే విషయాన్ని ముఖ్యంగా యువత గుర్తుంచుకోవాలి! అంటూ డాక్టర్ స్వయం ప్రకాష్ తన అభిప్రాయాల్ని ఆంధ్రభూమి పాఠకులకు ఎంతో ఉత్సాహంగా ఈ ఇంటర్వ్యూలో అందించారు!

ఇటు ఆధునిక విజ్ఞానం అటు భారతీయ ప్రాచీన వైద్యవిధానాల మీదేకాక సెక్సాలజీ, సైకాలజీ వంటి శాస్త్రాలలో కూడా మంచి పరిజ్ఞానం ఉన్న డాక్టర్ స్వయం ప్రకాష్ నిర్వహించే ఈ సరికొత్త శీర్షిక యువతీ యువకులకు ఆంధ్రభూమి అందిస్తున్న అద్భుతమైన కానుక!

**డా. ఆర్.బి.ఎన్. ప్రసాద్**

**5-3-1992 ఆంధ్రభూమి**

**వారపత్రిక నిర్వహించిన ఇంటర్వ్యూ**